నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 కరీంనగర్, శుక్రవారం 19 జనవరి 2024 KARIMNAGAR

## అత్యాశకు పోతే.. ₹1.50 లక్షలు పాయె

### సైబర్ నేరస్తుల మాయలో పడి మోసపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగి

జ్యోతినగర్, జనవరి 18 : అత్యాశకు పోయి ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి నిండా మునిగాడు. సైబర్ నేరస్తుల మాయలో పడి ₹లక్షా 50 వేలు మోసపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌కు చెందిన కాంట్రాక్ ఉద్యోగి అశ్రఫ్ అలీకి ఈ నెల 15న మూడు టాస్కుల గేమ్ ఆడితే కమిషన్ వస్తుందని టెలీగ్రామ్ యాప్‌కు ఓ లింక్ మెసేజ్ వచ్చింది. ఆశతో లింక్ ఓపెన్ చేశాడు. అయితే గేమ్ ఆడాలంటే అందుకు కొంత డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని పేర్కొనడంతో తన అకౌంట్ నుంచి నాలుగు, ఐదు దఫాలుగా ₹20 వేల నుంచి ₹30 వేల చొప్పున ₹లక్షా 50 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తర్వాత గేమ్ ఆడాడు. కానీ, ఎలాంటి కమిషన్ రాలేదు. తాను ఇచ్చిన ₹1.50 లక్షలు కూడా తిరిగి రాలేదు. దాంతో తాను మోసపోయానని తెలుసుకొని లబోదిబోమన్నాడు. గురువారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ జీవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేములవాడ బల్దియాకు కరెంట్ కట్



జనరేటర్ వెలుగుల్లో మున్సిపల్ కార్యాలయం

వేములవాడ, జనవరి 18: వేములవాడ బల్దియా కార్యాలయానికి కరెంట్ కట్ అయింది. సిరిసిల్ల విద్యుత్ సహకార సంస్థకు ₹2.50 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో సెస్ అధికారులు బుధవారం విద్యుత్ కనెక్షన్ తొలగించారు. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు నీటి సరఫరా, వీధి దీపాలకు సంబంధించి సుమారు ₹2.50 కోట్ల మేరకు బకాయిలు చేరుకున్నాయి. అయితే వారం కిందటే విద్యుత్ కనెక్షన్ తొలగించగా కలెక్టర్ చొరవతో పునరుద్ధరించారు. బుధవారం గడువు ముగిసినా బిల్లులు కట్టలేదు. వెంటనే బిల్లులు కట్టాలని సెస్ ఏఈ సిద్దార్థ బల్దియా కమిషనర్ అన్వేశ్‌ను కోరారు. ₹12 లక్షల చెక్కు ఇవ్వగా సెస్ అధికారులు తిరస్కరించారు. అందులో కనీసం ₹కోటి అయినా చెల్లించాలని పట్టుబడుతూ బుధవారం కనెక్షన్ తొలగించారు. మరో రెండు రోజుల తర్వాత వీధి దీపాల కనెక్షన్ కూడా తొలగిస్తామని చెబుతున్నారు. కాగా, ప్రస్తుతం జనరేటర్ సహాయంతో మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

# నర్సింగ్ కాలేజీపై నీలినీడలు

- కరీంనగర్‌లో అప్‌గ్రేడ్‌కు అవకాశం ఇవ్వని ప్రభుత్వం
- తాజాగా హైదరాబాద్‌లోని డీఎంఈలో సమావేశం
- ఇక్కడి ప్రిన్సిపాల్‌కు అందని సమాచారం
- ఐదు నర్సింగ్ స్కూల్స్‌కే అప్‌గ్రెడేషన్
- నిధుల వినియోగం చూపలేదని మొండి చేయి
- విస్మరించడంపై అనేక సందేహాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్‌పైనే భారం



నర్సింగ్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ట్యూటర్

**కరీంనగర్‌లో నర్సింగ్ కాలేజీ అప్‌గ్రేడ్‌పై నీలినీడలు అలుముకున్నాయి. గురువారం హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొనడానికి ప్రిన్సిపాల్‌కు సమాచారం అందక పోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నర్సింగ్ స్కూల్‌ను కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తారా..? లేదా..? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. కేవలం ఇప్పటి వరకు ఇచ్చిన నిధుల వినియోగంపై ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదనే కారణంగానే నిర్లక్ష్యం జరుగుతున్నదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.**

కరీంనగర్, జనవరి 18 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : ఉత్తర తెలంగాణకు ప్రధాన కేంద్రంగా ఉన్న కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానకు అనుబంధంగా 2013-14లో అప్పటి ప్రభుత్వం నర్సింగ్ స్కూల్‌ను మంజూరు చేసింది. దీంతోపాటే నిజామాబాద్‌లోనూ ఏర్పాటు చేసింది. అప్పటికే రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా, సికింద్రాబాద్‌లోని గాంధీ, వరంగల్‌లోని ఎంజీఎం, నిజామాబాద్ జిల్లా బోధన్‌లో నర్సింగ్ స్కూళ్లు ఉండగా, కరీంనగర్, నిజామాబాద్‌ను కలుపుకొని రాష్ట్రంలో మొత్తం 6 నర్సింగ్ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. అయితే కరీంనగర్ నర్సింగ్ స్కూల్ అప్‌గ్రేడ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. నర్సింగ్ స్కూళ్ల అప్‌గ్రెడేషన్‌కు సంబంధించిన మీటింగ్‌కు సంబంధించి ఈ నెల 17న మిగతా ఐదు స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు మాత్రమే సమాచారం ఇవ్వడం, గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయంలో సమావేశం నిర్వహించడం చూస్తే కరీంనగర్‌ను విస్మరించినట్టు స్పష్టమవుతున్నది. అయితే, 2022లోనే అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అన్ని నర్సింగ్ స్కూల్స్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. తీరా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కరీంనగర్‌ను ఎందుకు విస్మరిస్తున్నదనేది అనేక సందేహాలకు తావిస్తున్నది.

### నిధుల వినియోగ పత్రం ఇవ్వలేదా..?

కరీంనగర్ నర్సింగ్ పాఠశాల ఏర్పాటు చేసినప్పుడు ఇక్కడి అధికారులు ₹25 కోట్లకు ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తున్నది. ఈ నిధులతో భవన నిర్మాణం, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ఇక్కడి అధికారులు నివేదించారు. అయితే, అప్పుడున్న ప్రభుత్వం ₹3.32 కోట్లు ఇవ్వగా, ఈ నిధులను దేనికి వినియోగించారనేది ఇప్పటి వరకు వినియోగ పత్రం ఇవ్వనట్టు తెలుస్తున్నది. ఈ కారణంగానే కరీంనగర్ నర్సింగ్ పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు డీఎంఈ అధికారులు అభ్యంతరాలు చెబుతున్నారనే విషయం చర్చకు వస్తున్నది. ఇదే కారణమైతే ఇప్పటికైనా ఇక్కడి అధికారుల నుంచి డీఎంఈ అధికారులు వినియోగ పత్రం తెప్పించుకోవచ్చు కదా..? అనే వాదనలు వినిపిస్తున్నాయి.

### నర్సింగ్ కళాశాలతో ప్రయోజనాలు

కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖాన సుమారు పది జిల్లాల ప్రజలకు సేవలందిస్తున్నది. అందులో 650 పడకలు ఏర్పాటు చేయగా, కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అనేక వింగ్‌లను అందుబాటులోకి తెచ్చింది. అంతే కాకుండా ఈ దవాఖానకు అనుబంధంగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. అయితే ఇప్పుడు నర్సింగ్ స్కూల్‌ను కాలేజీగా అప్‌గ్రేడ్ చేస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని వైద్య యంత్రాంగం చెబుతున్నది. ముఖ్యంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో నర్సింగ్ విద్య అందుబాటులోకి వస్తుంది. ప్రధానంగా కరీంనగర్ మెడికల్ హబ్‌గా మారే అవకాశముంటుంది.

### అందుబాటులోకి బీఎస్సీ నర్సింగ్ విద్య

ప్రస్తుత నర్సింగ్ స్కూల్లో ప్రస్తుతం జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) డిప్లొమా కోర్సు మాత్రమే నిర్వహిస్తున్నారు. కాలేజీగా అప్‌గ్రేడ్ అయితే బీఎస్సీ నర్సింగ్ విద్య అభ్యసించే అవకాశముంటుంది. ఇప్పుడు పాఠశాలలో 40 సీట్లు మాత్రమే ఉండగా, కళాశాలగా మారితే వంద సీట్లకు పెరుగుతుంది. బీఎస్సీ నర్సింగ్ కోర్సు నాలుగేళ్ల పాటు ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రస్తుత స్కూల్‌లో ప్రిట్రైనింగ్ స్కూల్ (పీటీఎస్) పూర్తి కాగానే ప్రాక్టికల్స్‌లో భాగంగా ప్రభుత్వ దవాఖానలో వీరి సేవలను వినియోగించుకుంటున్నారు. అయితే, ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు అత్యవసరంగా భావిస్తున్నారు.



కరీంనగర్‌లోని నర్సింగ్ స్కూల్

### మంత్రి పొన్నం జోక్యం తప్పనిసరి

కరీంనగర్ నర్సింగ్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేసే విషయంలో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఆయన ఎంపీగా ఉన్న సమయంలో ప్రభుత్వ దవాఖానపై ప్రత్యేక దృష్టి సారించిన విషయాన్ని ఇప్పుడు గుర్తు చేస్తున్నారు. కరీంనగర్‌తోనే ఏర్పాటు చేసిన నిజామాబాద్ నర్సింగ్ పాఠశాలను మాత్రం అప్‌గ్రేడ్ చేస్తున్నారు. కానీ, కరీంనగర్ నర్సింగ్ స్కూల్‌పై చిన్న చూపు కనిపిస్తున్నది. మిగతా ఐదు పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసిన తర్వాత కరీంనగర్ పాఠశాలను కొనసాగిస్తారా..? లేదా..? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న పొన్నం జోక్యం చేసుకుంటే గానీ కరీంనగర్ నర్సింగ్ పాఠశాల కళాశాలగా అప్‌గ్రేడేషన్ పొందే పరిస్థితులు కనిపించడం లేదు.

**మొదటి సెమిస్టర్ :** కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, అప్లయ్‌డ్ అనాటమి, అప్లయ్‌డ్ ఫిజియాలజీ, అప్లయ్‌డ్ సైకాలజీ, నర్సింగ్ ఫౌండేషన్స్-1.
**సెకండ్ సెమిస్టర్ :** అప్లయ్డ్ బయోకెమిస్ట్రీ, అప్లయ్‌డ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, నర్సింగ్ ఫౌండేషన్స్-2, హెల్త్ నర్సింగ్ ఇన్‌ఫార్మెటిక్స్ టెక్నాలజీ.
**మూడో సెమిస్టర్ :** అప్లయ్‌డ్ మైక్రోబయోలజీ అండ్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ఇన్‌క్లూడింగ్ సేఫ్టీ, ఫార్మకాలోజీ-1, పాథాలోజీ-1, అడాల్డ్ హెల్త్, నర్సింగ్-1 విత్ ఇంటిగ్రేడెట్ ఫాథో ఫిజియాలోజీ.
**నాలుగో సెమిస్టర్ :** ఫర్మకాలోజీ-2, ఫాథాలోజీ-2 అండ్ జెనటిక్స్, అడాల్డ్ హెల్త్ నర్సింగ్-2 విత్ ఇంటిగ్రేటెడ్ ఫాథో ఫిజియాలోజీ ఇన్‌క్లూడింగ్ జెరియాట్రిక్స్, ప్రొఫెషనలిజం, ప్రొఫెషనల్ వాల్యూస్ అండ్ ఎథిక్స్ ఇన్‌క్లూడింగ్ బయోథిక్స్.
**ఐదో సెమిస్టర్ :** చైల్డ్ హెల్త్ నర్సింగ్-1, మెంటల్ హెల్త్ నర్సింగ్-1, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్-1 (ఇన్‌క్లూడింగ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎపిడిమియాలోజీ), ఎడ్యుకేషనల్ టెక్నాలజీ/నర్సింగ్ ఎడ్యుకేషన్, ఇంట్రడక్షన్ టూ ఫోరెన్సిక్ నర్సింగ్ అండ్ ఇండియన్ లాస్.
**ఆరో సెమిస్టర్ :** చైల్డ్ హెల్త్ నర్సింగ్-2, మెంటల్ హెల్త్ నర్సింగ్-2, నర్సింగ్ మేనేజ్‌మెంట్ అండ్ లీడర్ షిప్, మిడ్‌వైఫరీ/అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలోజీ-1. ఏడో సెమిస్టర్ : కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్-2, నర్సింగ్ రిసెర్చ్ అండ్ స్టాటిస్టిక్స్, మిడ్‌వైఫరీ/అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలోజీ-2. ఎనిమిదో సెమిస్టర్ : ఇంటర్న్ షిప్ (ఇన్‌టెన్సివ్ ప్రక్టికమ్/రెసిడెన్సీ పోస్టింగ్.



మాట్లాడుతున్న కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

# బండి.. ఐదేళ్లలో ఐదు కొత్తలు తేలే

- అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ సర్కారు
- కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

మల్యాల (కొడిమ్యాల), జనవరి 18: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదేండ్లలో ఐదు కొత్తలు కూడా తేలేదని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. అబద్ధపు పునాదులపై ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు హామీల అమలులో తాత్సారం చేస్తున్నదని దుయ్యబట్టారు. వాగ్దానాలు నెరవేర్చకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఎట్టిపరిస్థితుల్లో తలవంచబోమని తేల్చిచెప్పారు. ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల తరుపున పోరాడుతామని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి కరీంనగర్ గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. మల్యాల మండలం రాంపూర్‌లో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్ర పోరును పతాకస్థాయికి తీసుకెళ్లారు. ఉద్యమానికి జడిసే కాంగ్రెస్ తప్పనిసరి పరిస్థితుల్లో తెలంగాణ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఐదుగురు ఎంపీలం పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించామని గుర్తు చేశారు. కరీంనగర్ ఎంపీగా తాను.. అనేక అభివృద్ధి పనులు చేశానని, ప్రధాని మోదీతో చర్చించి కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్పించి ₹వెయ్యి కోట్లు తెచ్చానని చెప్పారు. కరీం'నగరా'నికి నలు దిక్కుల జాతీయ రహదారులు నిర్మించామని చెప్పారు. అలాగే కొత్తపల్లి, మనోహరాబాద్ రైల్వేలైన్‌ను మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. 2009లో ఎంపీగా గెలిచిన పొన్నం ప్రభాకర్ రైల్వే ప్రాజెక్టులను పట్టించుకోలేదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రైతుబంధు కోసం కేటాయించిన ₹7700 కోట్లను ఉద్యోగుల వేతనాలకు మళ్లించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్ సర్కారు రైతులను ఎందుకు విస్మరించిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, జడ్పీటీసీ రాంమోహన్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మిట్టపెల్లి సుదర్శన్, సింగిల్ విండో చైర్మన్లు మధుసూదన్‌రావు, సాగర్‌రావు, రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌పై కోపాన్ని రైతులపై చూపద్దు

- నీళ్లులేక వాగుల్లో బావులు తవ్వుకుంటున్నరు
- రైతుబంధు,రుణమాఫీ అమలు చేయాలి
- రెండో విడత దళితబంధు విడుదల చేయాలి
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



రైతుబంధు గురించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోను చూపుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/ వీణవంక, జనవరి 18: 'తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఉన్న కోపాన్ని రైతులపై చూపద్దు. సాగుకు కరెంట్, నీళ్లు ఇవ్వకుండా గోస పెట్టడం తగదు' అని కాంగ్రెస్ నేతలకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హితవు పలికారు. పదేండ్లు రందిలేకుండా పంటలు పండించుకున్న రైతులు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెలకే నీళ్ల కోసం వాగుల్లో బావులు తవ్వుకునే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలను కాపాడేందుకు వెంటనే నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'మార్పు రావాలి.. మార్పు తేవాలి' అంటూ ఎన్నికల ముందర ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు తెచ్చిన మార్పు ఇదేనా? అని ప్రశ్నించారు. హుజూరాబాద్, వీణవంకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పంటలకు సాగునీరందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ఇప్పటికే ఇరిగేషన్ ఏఈతో మాట్లాడానని చెప్పారు. నీళ్లు విడుదల చేయకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తమ ప్రభుత్వం రాగానే రైతు భరోసా కింద ఎకరానికి ₹15 వేలు ఇస్తామని, వెంటనే రుణమాఫీ చేస్తామని ప్రగల్బాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం అందించడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. రుణమాఫీపై సైతం మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 18 వేల కుటుంబాలకు దళితబంధు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మొదటి విడుత నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని, ప్రస్తుతం వారంతా రెండో విడుత కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వెంటనే నగదు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, సర్పంచ్ నీల కుమారస్వామి పాల్గొన్నారు.

## ఆయువు తీసిన అతివేగం

### ట్రాక్టర్ ఢీకొని పన్నెండేండ్ల బాలుడి దుర్మరణం



చిక్రం జీవన్ (ఫైల్)

సారంగాపూర్, జనవరి18: అతివేగం బాలుడి ఆయువు తీసింది. ట్రాక్టర్ ఢీకొని ఓ నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది. రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించిన కొడుకును చూసి ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు ప్రతిఒక్కరినీ కలిచివేసింది. బీర్‌పూర్ ఏఎస్ఐ గజేందర్ వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెం గ్రామానికి చెందిన చిక్రం రవి-పార్వతి దంపతులకు ముగ్గురు కొడుకులు. రెండో కొడుకు చిర్రం జీవన్(12) గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం స్నేహితులతో ఆడుకొని సైకిల్‌పై ఇంటి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మొగ్రం సురేందర్‌కు చెందిన ట్రాక్టర్ అతివేగంగా వచ్చి సైకిల్‌ను ఎదురుగా ఢీకొన్నది. దీంతో బాలుడు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. జీవన్ మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

## కోరుట్లలో దారి దోపిడీ

కోరుట్ల, జనవరి 18: కోరుట్ల పట్టణ శివారులో దారి దోపిడీ జరిగింది. కలెక్షన్ డబ్బులు తీసుకొని ఇంటికెళ్తున్న పెట్రోల్ బంక్ సిబ్బందిని అడ్డగించి దోచుకోవడం కలకలం రేపింది. ఎస్ఐ కిరణ్ కుమార్ వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణ శివారు మెట్‌పల్లి రోడ్డులో ఉన్న మణి ఫిల్లింగ్ స్టేషన్‌లో కృష్ణ భగవాన్ పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో బంకు కలెక్షన్ తీసుకుని బైక్‌పై కోరుట్ల వైపు వెళ్తున్నాడు. అప్పటికే జాతీయ రహదారిపై కాపు కాచి ఉన్న ఇద్దరు దుండగులు బైక్‌ను అడ్డగించారు. బ్యాగులో ఉన్న ₹54 వేల నగదును ఎత్తుకొని బైక్‌పై పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు.

## 30 నుంచి ఆరాధనోత్సవాలు

వేములవాడ టౌన్, జనవరి 18 : వేములవాడ రాజన్న సన్నిధిలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. అందుకోసం ఆలయ ప్రాంగణంలోని ఓపెన్‌స్లాబ్‌పై వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఈ క్షేత్రంలో 71 ఏండ్లుగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని చెప్పారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో సుప్రసిద్ధ కళాకారులతో శాస్త్రీయ, భక్తి, సంగీత, హరికథ, నృత్య, నాటక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని త్యాగరాజ ఆరాధనోత్సవాల ఇన్‌చార్జి కొంటికర్ల రామయ్యశర్మ తెలిపారు

# కేటీఆర్‌తోనే వస్త్ర పరిశ్రమకు మహర్దశ

- బతుకమ్మ చీరెలు, ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్లతో నేతన్నకు ఉపాధి
- కాంగ్రెస్, బీజేపీ నేతలది మొసలి కన్నీరు
- టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జనవరి 18: బీఆర్ఎస్ పాలనలో కేటీఆర్ ప్రత్యేక చొరవతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు మహర్దశ పట్టిందని టీపీటీడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ స్పష్టం చేశారు. ఎనిమిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో నేతన్న అభ్యున్నతికి అనేక పథకాలు తెచ్చిన ఘనత కేటీఆర్‌కే దక్కిందని కొనియాడారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతినిండా పనికల్పించే లక్ష్యంతో బతుకమ్మ చీరెలు, ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్లు ఇప్పించారని గుర్తు చేశారు. కేసీఆర్ సర్కారు పాలనలోనే నేత కార్మికులు నిశ్చింతగా జీవితాలు సాగించారని చెప్పారు. ఇప్పుడు చేనేత, పవర్‌లూంకు తేడా తెలియని వారు కూడా బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుల కుటుంబాలకు కనీసం ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా తప్పించుకున్నదని దుయ్యబట్టారు. అప్పుడు సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు ఒక్క మీటరు బట్ట కూడా ఆర్డర్ ఇవ్వలేదని, ఆపోకొ బకాయిల చెల్లింపులో జాప్యం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే రీతిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. నిజంగా కార్మికులపై ప్రేమ ఉంటే బతుకమ్మ చీరెల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, గత ప్రభుత్వ హయాంలో కంటే నాలుగింతల వస్త్రాల ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు ఓట్ల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపాదనలు ఇస్తే మెగా పవర్ లూం క్లస్టర్ తెస్తానంటూ ఎంపీ బండి సంజయ్ చెబుతున్నాడని.. కానీ, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అనేకసార్లు కేంద్ర జౌళిశాఖ మంత్రికి వినతిపత్రాలు ఇచ్చారని గుర్తు చేశారు. గత ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుని వెంటనే సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో నేతన్నల కోసం వర్కర్ టూ ఓనర్ స్కీంలో భాగంగా 46షెడ్లు వీవింగ్ పార్కుతో పాటు 4కామన్ ఫెసిలిటీ కోసం ప్రారంభించిన షెడ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు రాంచంద్రం పాల్గొన్నారు.


# కల్తీ ఘటనలో కల్లు డిపో సీజ్

- నంబర్‌వన్ కల్లు డిపో డైరెక్టర్లపై కేసు
- 'ఖని'లో కలకలం రేపిన ఇద్దరి మరణాలు

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 18: కల్తీ కల్లు మరణాలతో గోదావరిఖని ప్రాంతంలో కలకలం రేగింది. మేషన్ కూలీలు మామిడి రమేశ్, రాంపెల్లి నవీన్ బుధవారం రాత్రి చనిపోగా, పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఇద్దరి మృతదేహాలను ఖని ఏరియా దవాఖానకు తరలించారు. గురువారం ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సీసీ కెమెరాల నిఘాలో వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను గోదావరిఖని సబ్ డివిజన్ ఏసీపీ తుల శ్రీనివాసరావు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. అయితే, కల్తీ కల్లు వల్లే మృతిచెందారని, కల్లు డిపోను సీజ్ చేయాలని బంధువులు డిపో ఎదుట ధర్నాకు దిగే క్రమంలోనే వన్‌టౌన్ పోలీసులు అడ్డగుంటపల్లి నంబర్‌వన్ కల్లుడిపోను సీజ్ చేశారు. మృతుడు రమేశ్ కొడుకు అవినాశ్ ఫిర్యాదు మేరకు కల్లు డిపో డైరెక్టర్ వంగ శ్రీనుతో పాటు పలువురు డైరెక్టర్లపై కేసునమోదు చేశారు. ఎక్సైజ్ పోలీసులు కల్లు శాంపిల్‌ను సేకరించి వరంగల్‌లోని ల్యాబ్‌కు తరలించారు. కాగా, ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మహంకాళి, తిప్పారపు శ్రీనివాస్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. అలాగే, బాధిత కుటుంబాలకు ₹20 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని, కల్లు డిపో సొసైటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్, ఉపాధ్యక్షుడు రేణికుంట్ల నరేంద్ర డిమాండ్ చేశారు.

# విద్యార్థులపై కేర్ తీసుకోండి

- సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి
- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కల్యాణి సస్పెండ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల తెలంగాణ చౌక్, జనవరి18: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో ఉండే విద్యార్థులపై కేర్ తీసుకోవాలని అధికారులను సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని గీతానగర్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూం, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. వసతి గృహ అధికారి కల్యాణి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో సస్పెండ్ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దుప్పట్లు, యూనిఫాంలు పంపిణీ చేశారా..? మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా..? అంటూ ప్రశ్నించారు. హాస్టల్‌కు పేయింట్ వేయించాలని స్పెషల్ ఆఫీసర్, లేబర్ ఆఫీసర్ రఫీని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యను పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జి మైనార్టీ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, స్పెషల్ అధికారి సర్వర్ మియా తదితరులు ఉన్నారు.